క్లుప్తంగా

పంచారామాలకు ప్రత్యేక బస్సు

తిరువూరు: ప్రసిద్ధ శైవక్షేత్రాలైన పంచారామాలకు తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 10వ తేదీన ప్రత్యేక బస్సుసర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజరు వేణు తెలిపారు. రాత్రి ఒంటిగంటకు తిరువూరులో బయలుదేరి అమరావతిలో అమరలింగేశ్వరుడి దర్శనం అనంతరం పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలను భక్తులు సందర్శించుకోవచ్చని పేర్కొన్నారు. రానుపోను టికెట్ ధర రూ.1,400గా నిర్ణయించామని, ఆన్‌లైన్లో ఈ బస్సు సర్వీసు నంబరు 95323కు ముందస్తు టికెట్ రిజర్వేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. సమాచారం కోసం 98856 61835లో సంప్రదించాలని కోరారు.

రైతులకు నష్టం కలుగకుండా ముందస్తు చర్యలు



మైలవరం: రైతులకు ఎటువంటి నష్టం కలుగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టినట్లు మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మార్కెట్ యార్డులోని రైతులు నిల్వ చేసుకున్న పత్తి బోరాలను బుధవారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో పట్టాలు ఏర్పాటు చేసి పత్తి తడిసిపోకుండా నష్ట నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాధిత రైతులకు అండగా ఉంటుందని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొత్తనాగులూరు(రెడ్డిగూడెం): మండలంలోని కొత్తనాగులూరులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తుపాను వల్ల వరి రైతులు నష్టపోకుండా తేమశాతం 17 శాతం పైన ఎక్కువ ఉన్నా కూడా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రంగు మారిన ధాన్యం కూడా కొనుగోలు చేనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ నాగబాబు, రైతు సలహా మండలి ఆధ్యక్షుడు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు రామారావు, ప్రసాద్, హరి, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

మధురంగా సాగిన వీణా వాద్య కచేరి



విజయవాడకల్చరల్: గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 140 వ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని చిట్టూరి కళావేదికపై నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారుడు చిట్టా కార్తీక్ త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, అన్నమయ్య కీర్తనలను మధురంగా వీణపై పలికించారు. నగుమోము కనలేని, బ్రోచేవారెవరురా, రఘువంశ సుధాంబుధి చంద్ర, నారాయణతే నమో నమో, థిల్లానా తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ మృదంగంపై, హరిబాబు ఘటంపై సహకరించారు. గురువారం నాటి కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ కల్యాణి ఏకరాగ సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యురాలు అంజనా సుధాకర్ తెలిపారు.

దుర్గమ్మ సేవలో టీటీడీ చైర్మన్ భూమన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): టీటీడీ పాలకమండలి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భూమనను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కెఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం భూమనకు వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ చైర్మన్ , ఈవోలు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని, పట్టు వస్త్రాలను అందజేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగన్ పాలన



ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



నూజివీడులోని ఎమ్మెల్యే కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం(మైలవరం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన జరుగుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం శక్తినగర్‌లోని డాక్టర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే వసంత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి, పేదల అభ్యున్నతికి పెద్దపీట వేయడంతో ఆర్థిక అసమానతలు లేని సమసమాజ స్థాపనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నడిబొడ్డున వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 125అడుగుల అంబేడ్కర్ భారీ విగ్రహం, స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మైలవరంలో..

మైలవరం: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జి.వెంకట్రావు అంబేడ్కర్ చిత్రపటానికి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రోడ్డులోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌విగ్రహాలకు నివాళులర్పించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ సేవలను కొనియాడారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

నూజివీడు: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, నూజివీడు పీఏసీఎస్ అధ్యక్షుడు సాయిబాబు, మాజీ కౌన్సిలర్లు లవకుమార్, సురేష్‌బాబు, నాయకులు సుగుణరావు, విజయ్‌కుమార్, జోగారావు, చేబత్తిన మున్నా, ఆదినారాయణ, రవితేజ, డీడీ సాల్మాన్, జోజి పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం మండలంలోని చిన్నంపేటలో నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బడుగుల దేవుడు అంబేడ్కర్

తిరువూరు: బడుగు బలహీనవర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దైవసమానుడని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాగనర్సిరెడ్డి నివాళులర్పించారు. ఎంపీపీ గద్దల భారతి, తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, ఏఎంసీ డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. తిరువూరు గాజులమాలపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. తిరువూరు బోసు సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు గోపాల్, ప్రసన్నకుమార్, టైటస్, వెంకటేష్, బీజేపీ నాయకురాలు పోలే శాంతి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ దాసరి సతీష్, వైఎస్సార్ సీపీ నాయకుడు చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయి మండలం చిన్నంపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి



తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి



ఎ.కొండూరు మండలం కంభంపాడులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

అన్నదాతలను ఆదుకునేందుకు చర్యలు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



జి.కొండూరు మండలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు(మైలవరం): తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. జి.కొండూరు మండలం వెలగలేరు, వెల్లటూరు గ్రామాల్లో తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పైరును ఎమ్మెల్యే వసంత బుధవారం పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. నీట మునిగిన వరిని, అన్నదాతల కష్టాలను స్వయంగా చూసిన ఎమ్మెల్యే వసంత వెంటనే వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే నష్టపరిహారం అంచనాలను నివేదించాలన్నారు. ఇప్పటికే జరిగిన పంట నష్టం గురించి ప్రాథమిక అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఇప్పటికే తగు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలుకు కూడా చర్యలు తీసుకుంటమన్నారు. వెలగలేరులో మామిడి, ఇతర గ్రామాల్లో పత్తి, మిరప కూడా దెబ్బ తిందని, వీటికి కూడా పారదర్శకంగా అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఉద్యాన శాఖ అధికారులకు సూచించారు. అనంతరం హెచ్ ముత్యాలంపాడు వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టును పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న దేవినేని ఉమా బుడమేరుపై హైలెవల్ వంతెన నిర్మాణం చేయలేకపోయాడన్నారు. హైలెవల్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

వెల్వడంలో..

వెల్వడం(మైలవరం): పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం వెల్వడంలో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను బుధవారం ఎమ్మెల్యే వసంత పరిశీలించారు. మైలవరం మండలంలో వరి 4,500 ఎకరాలు, మొక్కజొన్న 250 ఎకరాల్లో దెబ్బతిందని వ్యవసాయ శాఖ అధికారులు నివేదికలో రూపొందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చేసిన పనులకు గ్రామసభలో ఆమోదం

పెనుగొలను/అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం): సామాజిక తనిఖీలో భాగంగా గంపలగూడెం మండలంలోని మూడు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి గత ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు ఆమోదం పొందారు. మండలంలోని పెనుగొలను, అమ్మిరెడ్డిగూడెం, దుందిరాలపాడు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయం వద్ద ఆడిట్ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామసభలు జరిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులను ఆయా గ్రామసభలో ప్రవేశపెట్టి ఆమోదం తీసుకున్నారు.

పెనుగొలనులో రూ. 90 లక్షలతో 127 పనులు, అమ్మిరెడ్డిగూడెంలో రూ. 35 లక్షలతో 45 పనులను ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించినట్లు గ్రామసభలో నివేదిక ప్రవేశపెట్టి ఆమోదం తీసుకున్నారు. ఎస్ఆర్పీ సింహాద్రి, డీఆర్పీ సీమరాజు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వరరావు, గ్రామాల సర్పంచ్‌లు సంగెపు లలిత, బజ్జూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపినందుకు రూ.10వేల జరిమానా

నూజివీడు: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పట్టుబడిన ఇరువురికి నూజివీడులోని ఒకటో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు జరిమానా విధించినట్లు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపారు. రెండు రోజుల క్రితం నిర్వహించిన డ్రంక్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలను నడుపుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిని బుధవారం స్థానిక ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున జడ్జి వెంకటేశ్వరరావు జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మిచాంగ్‌తో దెబ్బతిన్న పంటలు



నూజివీడు: మిచాంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు నూజివీడు నియోజకవర్గంలో పంటలు పెద్ద ఎత్తున దెబ్బ తిన్నాయి. కోతకు వచ్చి కోయకుండా ఉన్న వరి పొలాలు కిందకు వాలిపోవడం, పనలు నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న, మినుము, పత్తి, నాటుపొగాకు పంటలు సైతం తుపాను ప్రభావం కారణంగా దెబ్బతిన్నాయి. మంగళవారం ఒక్కరోజే నియోజకవర్గంలోని నూజివీడు మండలంలో 116.8 మి.మీ., ఆగిరిపల్లిలో 150.4 మి.మీ., ముసునూరులో 110.2 మి.మీ., చాట్రాయిలో 140 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. నూజివీడు మండలం సుంకొల్లులో వరద నీటికి కోతకు వచ్చిన వరి మునిగిపోయింది. వెమొక్కజొన్న, నాటు పొగాకు, పత్తి పంటలు సైతం నీటి ముంపునకు గురయ్యాయి.

జాగ్రత్తలు తీసుకోండి

తడిసిన వరిపనలను ఆరబెట్టుకోవాలని వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి తెలిపారు. 10 లీటర్ల నీటికి అరకేజీ ఉప్పు కలిపి వరి పనలపై చల్లుకోవాలని పేర్కొన్నారు.

పంట పొలాల పరిశీలన

ఎ.కొండూరు: మండలంలోని గోపాలపురం, చీమలపాడు, కృష్ణరావుపాలెం, గొల్లమండల, రేపూడి, కోడూరు తదితర గ్రామాల్లో తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ టిప్పు సుల్తాన్ మాట్లాడుతూ తుపాను కారణంగా నష్టపోయిన పంట పొలాలను సందర్శించి ప్రాథమిక పంట నష్టం అంచనాలు వేశామన్నారు. ఉద్యాన అధికారి బి.నరేంద్ర, ఏఈఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఆగిరిపల్లి: మండలంలోని వరి పంటలను పండించిన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి పల్లగానీ చెన్నరావు సూచించారు. తపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను, ధాన్యం రాశులను, వరి పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు.

చిట్టేలలో..

చిట్టేల(తిరువూరు): తుపాను కారణంగా కురిసిన భారీవర్షాలతో నీటమునిగిన వరిపొలాలను తిరువూరు ఏఓ పద్మ బుధవారం పరిశీలించారు. చిట్టేల గ్రామంలో పొలాల్లోకి చేరిన వర్షపునీటి తొలగింపునకు తీసుకోవలసిన సస్య రక్షణచర్యలను రైతులకు సూచనలిచ్చారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ బుధవారం వరద ప్రభావిత ప్రాంతాలను, ఆగిరిపల్లిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఎ.కొండూరు మండలంలో దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: తుపాను కారణంగా కురిసిన వర్షాలకు నేలకు ఒరిగిన వరిపంటలను మండల వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. మండలంలోని చంద్రుపట్ల, వేమిరెడ్డిపల్లి, కొర్లమండ గ్రామాల్లో ఏఓ పర్యటించి ఒరిగిపోయిన పంట పొలాలను పరిశీలించారు. రైతులు పంట పొలాల్లో దారులు తీసి నీరు బయటకు పోయే ఏర్పాట్లు చేయాలన్నారు. పడిపోయిన వరిపొలాల్లో ధాన్యం మొలకలు రాకుండా నివారించేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని కంకులు పూర్తిగా తడిసేటట్లు పిచకారీ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిబంధనలు సడలించిన కారణంగా కోసి కల్లాల్లో ఉన్న ధాన్యం ఆరబోసి కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయమించుకోవాలని పేర్కొన్నారు. చంద్రుపట్లలో వర్షాలకు నేలకొరిగిన వరిపంటను వ్యవసాయాధికారుల దృష్టికి సర్పంచ్ బాలకొండయ్య తీసుకెళ్లారు. మండలంలో వివిధ గ్రామాల్లో ఉద్యాన పంటలను ఉద్యాన అధికారి బి.నరేంద్ర కుమార్ పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు.



తిరువూరు మండలం చిట్టేలలో పొలాలను పరిశీలిస్తున్న ఏఓ

మిరప, బీరతోటల పరిశీలన

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): తుపాను నేపథ్యంలో బుధవారం ఉద్యానశాఖ మండల అధికారి పి.పరమేశ్వరరెడ్డి కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని మిరప, బీర తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ మిరప తోటల్లో మొవ్వకుళ్లు తెగులు అధికంగా వ్యాపించిందని తెలిపారు. మొవ్వతెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. తామరపురుగు నారుమళ్లు, సాలు తోటలలో ఆశించడం వలన మొవ్వ, చిగురు భాగం ఎండిపోతుందని తెలిపారు.

రైతులు చేపట్టాల్సిన చర్యలు

వైరస్‌ను తట్టుకునే రకాలను సాగుచేసుకోవాలని, కలుపు మొక్కలను లేకుండా శుభ్రంచేసుకోవాలని పరమేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. పొలం చుట్టూ 2,3 వరుసలు జొన్నగాని మొక్కజొన్న గాని రక్షక పంటలు వేసుకోవాలన్నారు. విత్తనశుద్ధి చేసుకుని ఒక కిలో విత్తనానికి ఎనమిది గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ పురుగుల మందును, రసం పీల్చుపురుగుల నివారణకు విత్తనం ద్వారా వ్యాపించే వైరస్ తెగులు నివారణకు ట్రైనోడియం ఆర్థో ఫాస్ఫేట్‌తో విత్తనశుద్ధి చేయాలన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగు వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్

చాట్రాయి: తుపాను వలన పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. మండలంలోని చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగు వరదతో పడిన గండిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వరి, మిర్చి, పత్తి, అరటి తోటలకు నష్టం వాటిల్లిందని, అధికారులు పరిశీలించి నష్టాన్ని అంచనా వేసిన తరువాత బాధితులకు నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగుకి ఎగువ నుంచి వస్తున్న వరదతో కాజ్‌వేకి గండి పడిందని, వరద తగ్గిన తరువాత మరమ్మతులు చేపడతామన్నారు. అనంతరం సి గుడిపాడులో నేలవాలిన మిరప తోటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీ కోఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చెన్నారావు, నూజివీడు మున్సిపల్ కౌన్సిలర్‌రాము, తహసీల్దార్ విశ్వనాథరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ విద్యాసాగర్, ఉద్యాన శాఖాధికారి హేమ, ఏఓ శివశంకర్ పాల్గొన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం మండలంలోని చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగుకి వస్తున్న వరద నీటిని పరిశీలించారు.

పేదల జీవితాల్లో సంక్షేమ కాంతులు



ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణలో నాయకులు

నూజివీడు: సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని రెండో వార్డు సచివాలయం పరిధిలో బుధవారం వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా సంక్షేమ లబ్ధిని తెలియజేసే బోర్డును ప్రారంభించారు. కౌన్సిలర్ మౌనిక, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, మాజీ కౌన్సిలర్ రామారావు, మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ, నాయకులు జోగారావు, మున్నీ, రషీద్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం

గానుగపాడు(తిరువూరు): ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. తిరువూరు మండలం గానుగపాడులో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వాల నిరాదరణకు గురై అన్ని విధాలా వెనుకబడిన పేదల కోసం పలు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టారన్నారు. పలు సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలిపే డిస్ప్లే బోర్డులను ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరెడ్డి, గోపిరెడ్డి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు మీరా సాహెబ్, ఈఓపీఆర్‌డీ వెంకటరత్నం పాల్గొన్నారు.

పల్లె సీమల ప్రగతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

ముసునూరు: పల్లె సీమల సమగ్ర ప్రగతి జగనన్న సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యం అని జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా బుధవారం అక్కిరెడ్డిగూడెం గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధి వివరాల బోర్డును వైస్ ఎంపీపీ రాజానాయన నేతలతో కలసి ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కట్టెలేరు



చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగులో వరద నీరు

గంపలగూడెం: ఎగువ తెలంగాణ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా గంపలగూడెం మండలంలో ప్రధాన నీటి వనరైన కట్టెలేరులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. మండలంలోని తోటమూల-వినగడప గ్రామాల నడుమ ధ్వంసమైన వంతెన వద్ద ఏటిపై రాకపోకలకు నిర్మించిన డైవర్షన్ రహదారిపై నీరు అడుగు ఎత్తున్న పారుతుంది. దీంతో గంపలగూడెం-విజయవాడ ఆర్అండ్‌బీ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఏటి ఎగువ గ్రామాల ప్రజలు గంపలగూడెంకు వచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. ఏటి వద్ద వరద పరిస్థితిని తిరువూరు ఆర్డీఓ మాధవి పరిశీలించారు.

ఏటి వద్ద ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎస్సై రాంబాబును ఆదేశించారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌కు భారీ వరద

చాట్రాయి: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు వరద ఎగువ నుంచి వస్తున్న వరద తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు చేరుతుంది. బుధవారం సాయంత్రానికి 10 వేల క్యూసెక్కుల వరద నీరు రిజర్వాయర్‌కు చేరుతుందని, ప్రస్తుతం నీటి మట్టం 3.42 అడుగులు ఉందని టీఆర్‌పీ ఏఈ పరమానందం తెలిపారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలోని మంగళవారం కురిసిన భారీ వర్షానికి కుంపిని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆగిరిపల్లి, నూగండపల్లి, చిన్నగిరిపల్లి, తోటపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనపై వరద నీరు ఎక్కువగా ఉండటంతో ఎస్సై చంటిబాబు పోలీసులతో గస్తీ ఏర్పాటు చేశారు.

మహానటి నటజీవితం భావి నటులకు ఆదర్శం



పల్లెకొండ శ్రీనివాస్, చావా నరసింహరావులను సత్కరిస్తున్న విజయలక్ష్మి, ఉమాబలరాం తదితరులు

విజయవాడ కల్చరల్: మహానటి నటజీవితం భావి నటీమణులకు ఆదర్శమని కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సినీ నటి, నిర్మాత, దర్శకురాలు సావిత్రి 88 వ జయంతి వేడుకలు, సావిత్రి స్మారక పురస్కారాలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి గొప్పనటి అని, అంతకుమించి గొప్ప మానవతా మూర్తిగా అభివర్ణించారు. ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మాట్లాడుతూ ఆమె నడిచే నట గ్రంథాలయమని ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలరన్నారు. కార్యక్రమంలో ప్రభల శ్రీనివాస్, బీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, ఉమా బలరాం సావిత్రి నటజీవిత విశేషాలను వివరించారు. 2023వ సంవత్సరానికి గానూ పల్లెకొండ శ్రీనివాస్, చావా నరసింహరావులకు మహానటి సావిత్రి అవార్డులను అందజేశారు. గాయకులు సుధారాణి, విష్ణుప్రియ, రసూల్‌బాబు, కొమ్మినేని రత్నకుమారి సావిత్రి నటించిన చిత్రగీతాలను ఆలపించారు.

రేపటి నుంచి 144 సెక్షన్

విజయవాడ స్పోర్ట్స్: ప్రజా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రాంతాల్లో ఈ నెల ఏడోవ తేదీ నుంచి 144 సీఆర్‌పీసీ కింద నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం తెలిపారు. 2024 జనవరి 25వ తేదీ వరకు 50 రోజుల పాటు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం భవానీపురం, వన్ టౌన్, టూ టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో నలుగురు, అంతకు మించి ఎక్కువ మంది ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడరాదని పేర్కొన్నారు.

కోదండరామునికి విశేష అభిషేకాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని భావనారాయణవీధిలో కొలువై ఉన్న శ్రీ కోదండరామునికి బుధవారం పలు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో కార్తికమాసంలో పునర్వసు నక్షత్రం తిథి నుంచి నవమి వరకూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం స్వామి వారికి విశేష స్నపనాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారం చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com